క్లుప్తంగా

రోడ్ సేఫ్టీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడిగా యర్రంశెట్టి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రోడ్ సేఫ్టీ ఎన్జీవో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా యర్రంశెట్టి అంజిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆయనను నియమిస్తూ రోడ్ సేఫ్టీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్కే దుర్గా పద్మజ గాంధీనగర్‌లో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ సంస్థ ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ప్రజల్లో చైతన్యం నింపి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరారు. తనను ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా నియమించిన దుర్గా పద్మజకు యర్రంశెట్టి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఘంటసాల వర్ధంతి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అమరగాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం ఠాగూర్ గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఘంటసాల చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత గ్రంథాలయాధికారి అవిర్నేని వెంకటేశ్వరరావు పాల్గొని ఘంటసాల జీవిత విశేషాలను వివరించారు. ఘంటసాల తెలుగు సినీ రంగంలో ఎంతో ఖ్యాతి గడించారని, ఆయన ఆలపించిన ఎన్నో మధుర గీతాలు నేటికీ అనేక మంది ఇళ్లల్లో మోగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. ఘంటసాల ఆలపించిన భగవద్గీత తెలుగు నాట అత్యంత జనాదరణ పొందిందని పేర్కొన్నారు. విద్యార్థులు ఘంటసాల జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఘంటసాల పాటలు ఆలపించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె. రమాదేవి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విష్ణు సహస్ర నామ పారాయణం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యాన పారాయణం జరిగింది. పారాయణ మండలి సభ్యులు భక్తిశ్రద్ధలతో పారాయణం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు, పారాయణ మండలి సభ్యులు పాల్గొన్నారు.

'గేటు' రూటు మారేదెన్నడో.!

- న్యూఆర్ఆర్‌పేట నుంచి ఓల్డ్ఆర్ఆర్‌పేట మీదుగా వన్‌టౌన్‌కు వెళ్లేందుకు అవస్థలు
- ఇబ్బందులు పడుతున్న రెండు నియోజకవర్గాల ప్రజలు
- ఆర్‌యూబీ నిర్మించాలని వినతి



రైల్వే గేటు పడటంతో వేచి ఉన్న ప్రజలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరీపేట నుంచి పాత రాజరాజేశ్వరీపేట మీదుగా వన్‌టౌన్ ప్రాంతానికి వెళ్లేందుకు సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. న్యూఆర్ఆర్‌పేట, సింగ్‌నగర్ ప్రాంతాల నుంచి వన్‌టౌన్‌కు వెళ్లాలన్నా.. అటు ఓల్డ్ ఆర్ఆర్‌పేట నుంచి సింగ్‌నగర్, వాంబేకాలనీ ప్రాంతాలకు రావాలన్నా.. ఉన్న ఒకే ఒక్క రోడ్డు మార్గంలో రైల్వే గేటు ఉంది. రెండు నియోజకవర్గాల(పశ్చిమ, సెంట్రల్) ప్రజలు రాకపోకలు సాగించాలంటే ఈ రైల్వే గేటును దాటి వెళ్లాల్సిందే. ఇక్కడ గేటు పడితే అర గంట వరకు వేచి చూడాలి. దీంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు.

'ఆర్‌యూబీ'పై దృష్టి సారించాలి

పాఠశాలలు, కళాశాలలు, పనుల నిమిత్తం వెళ్లే సమయంలో గేటు పడితే అరగంట వరకు సమయం వృథాగా పోయినట్లే. కొంతమంది ప్రయాణికులు ప్రమాదమని తెలిసి కూడా రైల్వే గేటు దాటి వెళ్లేందుకు సాహసాలు చేస్తుంటారు. ఈ క్రమంలో పలువురు ప్రయాణికులు గాయాలపాలుకాగా మరికొంతమంది ప్రాణాలు సైతం పోగొట్టుకున్న సంఘటనలు గతంలో చోటుచేసుకున్నాయి. పాత రాజరాజేశ్వరీపేట – న్యూఆర్ఆర్‌పేట మధ్యలో ఉన్న రైల్వే గేట్ వద్ద ఆర్‌యూబీ (రైల్వే అండర్ బ్రిడ్జ్) మార్గాన్ని ఏర్పాటు చేయాలనేది రెండు నియోజకవర్గ ప్రజల చిరకాల కోరిక. ఈ మార్గంలో ఆర్‌యూబీని నిర్మిస్తే ఈ ప్రాంత ప్రజలందరికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఇప్పటికైనా ప్రభుత్వం ఆర్‌యూబీ నిర్మించాలని స్థానిక ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

సమయం వృథా అవుతోంది



న్యూఆర్ఆర్‌పేట మీదుగా సింగ్‌నగర్ వెళ్లాలంటే మా ప్రాంత ప్రజలంతా ఈ మార్గంలో ప్రయాణిస్తుంటాం. ఇక్కడ గేటు పడితే అనేక ఇబ్బందులు అనేక ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ మార్గంలో ఆర్‌యూబీ నిర్మాణం జరిగితే అందరూ సమయానికి ఇళ్లకు, పనులకు చేరుకోగలుగుతారు.

– గొలగాని శ్రీనివాస్, పాత రాజరాజేశ్వరీపేట

ఆర్‌యూబీ నిర్మించాలి



న్యూఆర్ఆర్‌పేట, సింగ్‌నగర్ ప్రాంతాలకు చెందిన వేల మంది ప్రజలు వన్‌టౌన్‌లోని పలు దుకాణాల్లో పనులు చేస్తుంటారు. ఓల్డ్ ఆర్ఆర్‌పేట మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ రైల్వేగేటు పడటం వల్ల చాలా సమయం వృథా అవుతోంది. అదే ఆర్‌యూబీ నిర్మిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– షేక్ మొగలానా, న్యూఆర్ఆర్ పేట

ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అమరావతి బాలోత్సవం ఆధ్వర్యంలో ఫోరం ఫర్ ఆర్టిస్ట్ సహకారంతో సింగ్‌నగర్ వివేకానంద సెంటినరీ హైస్కూల్లో ఆదివారం చిత్రలేఖన పోటీలు ఉత్సాహంగా జరిగాయి. 650 మంది చిన్నారులు చిత్రలేఖనం పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను కనబర్చారు. అనంతరం జరిగిన సభలో అమరావతి బాలోత్సవం అధ్యక్షుడు ఎస్పీ రామరాజు మాట్లాడుతూ పిల్లలు చదువుల వెంటే పడకుండా ఇలాంటి ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా తమ ప్రతిభను వెలికితీయవచ్చన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సింగ్‌నగర్ బాధ్యులు సీహెచ్ పద్మ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు వెంకటరామరాజు, మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం బాధ్యులు ఇ.క్రాంతి, ప్రముఖ చిత్రకారులు చిత్రం సుధీర్, సంధ్యారాణి, గిరిధర్ పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకోవాలి



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): శాసనమండలి ఎన్నికల్లో చైతన్యంతో ఓటు హక్కును వినియోగించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. స్థానిక సీపీఎం నాయకులతో కలిసి సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. స్థానిక పట్టభద్రులను కలిసి వారితో మాట్లాడారు. పెద్దల సభకు మేధావులను ఎన్నుకోవాలని సూచించారు. నేడున్న పరిస్థితుల్లో విద్యావంతుల సమస్యలను ప్రతిబింబించే రీతిలో శాసనమడలి ఎన్నికల్లో విజ్ఞతతో ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. సీపీఎం నాయకులు కె.శ్రీదేవి, బి.రమణరావు, కె.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా యూటర్న్



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ ఆర్‌యూబీ సమీపంలోని యూటర్న్ ప్రమాదకరంగా మారింది. మధురానగర్ ఆర్‌యూబీకి రెండు వైపులా సర్వీసు రోడ్లు ఇచ్చారు. రాకపోకలు సాగించేందుకుగానూ ఆర్‌యూబీ నుంచి వచ్చిన వారు ఎటువైపుకైనా వెళ్లేందుకు రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన బారికేడ్లు తొలగించారు. దీంతో బీఆర్టీఎస్ రోడ్డు వైపు ఆర్‌యూబీ నుంచి వేగంగా వస్తున్న వాహన చోదకులు ఒక్కసారిగా యూటర్న్ తీసుకుని మలుపు తిరుగుతున్నారు. ఈ క్రమంలో వెనుక వైపు నుంచి వస్తున్న వాహనచోదకులు ఒక్కసారిగా వాహనాలను అదుపు చేయలేక ఢీ కొడుతున్నారు. కావున అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురం వ్యాయామశాల సమీపంలోని శ్రీగణపతి మందిరంలో ఆదివారం సంకటహర చతుర్థి పురస్కరించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో సంకటహర చతుర్థి సందర్భంగా శ్రీధర్మపరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. స్వామివారికి విశేషంగా అన్నాభిషేకం, పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దాడి ఘటనపై కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): స్థలం చుట్టూ కంచె వేస్తున్న తమపై ఇరువురు వ్యక్తులు దౌర్జన్యం చేసినట్లు వచ్చిన ఫిర్యాదుపై ఆదివారం నున్న పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. అజిత్‌సింగ్ నగర్‌కు చెందిన పిళ్ల దుర్గాప్రసాద్ ఫుట్‌వేర్ వ్యాపారం చేస్తుంటాడు. అదే వ్యాపారం చేస్తున్న కాపు మురళీకృష్ణకు దుర్గాప్రసాద్ రూ. 13.20 లక్షలు అప్పు ఇచ్చాడు. తీసుకున్న అప్పు తిరిగి చెల్లించేందుకు మురళీకృష్ణ డబ్బుకు బదులు నున్న వికాస్ కాలేజీ రోడ్డులో ఉన్న 10 సెంట్ల స్థలం రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది. ఆ స్థలం చుట్టూ కంచె వేస్తుండగా దుర్గాప్రసాద్, అతని భార్య సత్యదేవిపై మురళీకృష్ణ, అతని భార్య సుజాత దౌర్జన్యం చేశారు. సత్యదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కులగణనతోనే బీసీలకు సాధికారత

లబ్బీపేట(విజయవాడతూర్పు): జాతీయ స్థాయిలో ఈ సారి జరిపే జనగణనతో పాటే కులగణన తప్పక జరపాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు డిమాండ్ చేశారు. విజయవాడలోని టిక్కిల్‌రోడ్డులో ఉన్న కమ్యూనిటీ హాలులో ఆదివారం జనగణనలో సమగ్ర కులగణన అనే అంశంపై ఎన్టీఆర్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. త్వరలో విజయవాడ నగరంలో రెండు నుంచి మూడు కిలోమీటర్ల మేర భారీ నిరసన ర్యాలీ నిర్వహించి, కులగణన చేయాల్సిన ప్రాధాన్యం గురించి కేంద్రంలోని కూటమి ప్రభుత్వానికి కనువిప్పు చేయాలని సమావేశంలో తీర్మానించినట్లు సమావేశం అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో తెలిపారు. దేశంలో స్థానిక సంస్థలు, చట్ట సభల్లో బీసీలకు సరైన రిజర్వేషన్లు కేటాయించాలన్నా, జస్టిస్ రోహిణి కమిషన్ సిఫారసుల మేరకు ఓబీసీల వర్గీకరణ జరపాలన్నా, ఈ సారి జరిపే జనగణనతో పాటే కులగణన చేపట్టాలని కోరారు. కేంద్రంలో ప్రత్యేక ఓబీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసి, ఓబీసీ సబ్ ప్లాన్ మేరకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, ప్రత్యేక రాయితీలతో పథకాలు అమలు చేయాలన్నారు. ఓబీసీ సమాజ సాధికారత సాధించాలన్నా, త్వరలో కేంద్రం జరపబోయే జనగణనతో పాటే సమగ్ర కులగణన చేయడం ఒక్కటే మార్గమని పేర్కొన్నారు. గతంలో మోడీతో పాటు, అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్‌లు, ఈ సారి జరిపే జనగణనతో పాటు, ప్రత్యేక ఫార్మేట్‌లో కులం, కాలం పెట్టి దేశంలోని ప్రతి ఒక్కరినీ లెక్కిసామని వాగ్దానం చేశారని, కానీ ఇప్పుడు తాత్కారం చేయడం తగదన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘ ప్రతినిధులు మేకా వెంకటేశ్వరరావు, చెప్పాడ చందు, మహంతి వాసుదేవరావు, కేశవరావు, దూలిపూడి శ్రీనివాస్, గోపి నాగరాజు, రాంబాబు , నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కేసన శంకరరావు, ఇతర ప్రతినిధులు

ఎన్‌సీసీ-సీ సర్టిఫికెట్ రాత పరీక్ష



లబ్బీపేట(విజయవాడతూర్పు): కాకినాడ గ్రూప్ పరిధిలో ఎన్‌సీసీ యూనిట్లకు ఆదివారం విజయవాడలోని నలంద విద్యానికేతన్, పీబీ సిద్ధార్థ కళాశాల, ఆంధ్రా లయోల కళాశాలలో రాత పరీక్ష నిర్వహించారు. కాకినాడ గ్రూప్ కమాండర్ కల్నల్ రితిన్ మోహన్ అగర్వాల్ నేతృత్వంలో పరీక్షలు జరిగాయి. కాగా శనివారం సి సర్టిఫికెట్ ప్రాక్టికల్ పరీక్షలు, ఆదివారం రాత పరీక్షను నిర్వహించారు. ఎన్‌సీసీలో మూడేళ్ల పాటు శ్రమించి నేర్చుకున్న పలు అంశాలకు సంబంధించి నిర్వహించిన పరీక్షకు క్యాడెట్లు ఉత్సాహంగా పాల్గొని పరీక్ష రాశారు. నలంద విద్యానికేతన్‌లో ఫోర్ ఆంధ్ర గరల్స్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ బలిందర్ సింగ్ పర్యవేక్షణలో నిర్వహించిన రాత పరీక్షలో 16 , 17 బెటాలియన్ కు చెందిన 280 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పరీక్షకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాకినాడ గ్రూప్ కమాండర్ కల్నల్ రితిన్ మోహన్ అగర్వాల్ మాట్లాడుతూ విజయవాడ లో మూడు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించామని, విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పరీక్ష రాశారని పేర్కొన్నారు.

శ్రీకృష్ణదేవరాయలు ప్రజాపాలన ఆదర్శం



అతిథులను సత్కరించిన నిర్వాహకులు



కూచిపూడి నృత్యాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

విజయవాడ కల్చరల్: శ్రీకృష్ణదేవరాయలు ప్రజాపాలనను నేటి పాలకులు ఆదర్శంగా తీసుకోవాలని శ్రీకృష్ణదేవరాయలు విగ్రహ కల్చరల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు శీలం నాగేశ్వరరావు అన్నారు. శ్రీకృష్ణదేవరాయలు విగ్రహ కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాలలో ఆదివారం దేవరాయలు 554వ జయంతి వేడుకలు, సంప్రదాయ నృత్యాలు, తెలుగు సాహిత్యంలో విశేష కృషి చేసిన వారికి సత్కార కార్యక్రమం నిర్వహించారు. శీలం నాగేశ్వరరావు మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు కవి పండిత పక్షపాతి అన్నారు. ఆయన రచించిన ఆముక్తమాల్యద గ్రంథం తెలుగు సాహిత్యంలో విశిష్టమైనదని పేర్కొన్నారు. కాపు సంఘం నాయకుడు మల్లెమూడి పిచ్చయ్య, సాహిత్య రంగానికి చెందిన డీ దత్తాత్రేయశర్మ, రామతీర్థ, డాక్టర్ బాలకృష్ణ, పవన్‌కుమార్‌రెడ్డి, సత్యబ్రహ్మచారి, డాక్టర్ పూర్ణచంద్రరావు, అంజయ్య, శివకుమార్, నాగరాజులకు పండిత సత్కారం నిర్వహించారు. భాగవతుల వెంకట్రామశర్మ బృందం పలు కూచిపూడి నృత్యాలను ప్రదర్శించింది. వివిధ రంగాలకు చెందిన అర్జా పాండురంగారావు, బొర్ర రామకృష్ణ, బొబ్బాది చంద్రశేఖర్, చలమలశెట్టి రమేష్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. ఉదయం బీఆర్టీఎస్ రోడ్డులోని శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటించి, పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

'వయోవృద్ధ' సేవలు ఆదర్శనీయం



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నిరుపేద వృద్ధులకు సేవలు అందిస్తున్న వయోవృద్ధ ఛారిటబుల్ ట్రస్ట్ సేవలు ఆదర్శనీయమని సిద్ధార్థ వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు కట్టా జనార్ధనరావు అన్నారు. స్థానిక దుర్గాపురం విజయ్‌నర్సింగ్ కళాశాలలో ఆదివారం ట్రస్ట్ ఆధ్వర్యాన దాత బాలిరెడ్డి ఆనంద్‌రెడ్డి సహకారంతో వయోవృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ఆధారం లేని నిరుపేద వయోవృద్ధులను గుర్తించి ప్రతి నెలా నిత్యావసర సరుకులు అందించడంతోపాటు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం భారత వికాస పరిషత్ ఆధ్వర్యాన వృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్ ఛైర్మన్ తేజ్‌రాజ్ సోలంకి, క్లబ్ సెక్రటరీ కాట్రగడ్డ నాగేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, పులిపాక కృష్ణాజీ, ట్రస్టీలు తట్టి అర్జునరావు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



దుర్గగుడికి వెళ్లే వాహనాలతో కనకదుర్గ ఫ్లై ఓవర్ కింద ట్రాఫిక్ జామ్



సెల్‌ఫోన్, సామాన్ల కౌంటర్ల వద్ద భక్తుల రద్దీ

కిటకిటలాడిన

ఇంద్రకీలాద్రి

ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మను దర్శించుకునేందుకు ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఉదయాన్నే కొండపైకి చేరుకున్నారు. వాహనాలతో కనకదుర్గ ఫ్లై ఓవర్ కిటకిటలాడింది. కొద్దిసేపు ట్రాఫిక్ జామ్ అయింది. సెల్‌ఫోన్, సామాన్లు భద్రపరిచే కౌంటర్లు వద్ద కూడా భక్తులు బారులుతీరి కన్పించారు.– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



అంతరాలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



ఇంద్రకీలాద్రిపై నెలకొన్న భక్తుల రద్దీ



క్యూలైన్‌లో భక్తులకు మంచినీళ్లు ఇస్తున్న సిబ్బంది

విద్యార్థుల్లో అద్భుత సృజనాత్మకత

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థుల్లో అద్భుతమైన సృజనాత్మకత ఉంటుందని, దానిని వెలికితీస్తే ఉన్నత వంతులుగా తీర్చిదిద్దాలని తెలుగు రచయిత డాక్టర్ వి.సత్యవతి అన్నారు. అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం, తెలుగు చిత్రకారులు దామెర్ల రామారావు శత వర్ధంతిని పురస్కరించుకుని ఆర్ట్ మేట్ విద్యార్థులచే తెలుగు భాష పై వేసిన చిత్రాల ప్రదర్శన ఆదివారం జరిగింది. గురునానక్‌కాలనీలోని ఆర్ట్ మేట్ సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ చిత్రకళా ప్రదర్శనను రచయిత సత్యవతి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలుగు భాషపై మొదటిసారిగా చిత్ర కళా ప్రదర్శన ఏర్పాటు చేయడం పట్ల విద్యార్థులను అభినందించారు. ఆర్ట్ మేట్ చిత్రకళ సంస్థ డైరెక్టర్ ఎ.సునీల్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు చిత్రకళ పట్ల ఆసక్తిని కల్పించడంతో పాటు మన సంస్కృతిని తెలియచేడం ఈ ప్రదర్శన ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రత్యేక అతిథిగా మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం బాధ్యులు పిన్ననేని మురళీ కృష్ణ పాల్గొనా, సీనియర్ చిత్రకారులు పావులూరి చిదంబరం , అమరావతి బాలోత్సవం కార్యదర్శి ఆర్.కొండలరావు, చిత్రకళ ప్రేమికులు ఎం.మధుసూదనరావు పాల్గొని ప్రతిభ చూపిన చిన్నారులకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు సుధారాణి, సుష్మా, స్వాతి, రజియా, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.